క్లుప్తంగా

మిత్రుడికి ఆపన్న హస్తం



రామారావుకు నగదు అందజేస్తున్న స్నేహితులు

కవిటి: మండలంలోని బైరెడ్లపుట్టుగకు చెందిన బి.రామారావు అనే వ్యక్తి కేన్సర్ బారినపడిన విషయాన్ని తెలుసుకున్న తన చిన్ననాటి మిత్రులు ఉదారంగా స్పందించి ఆపన్న హస్తం అందించారు. ఈ మేరకు బాధితుడు ఇంటికి గురువారం వెళ్లి అతని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ వంతుగా సేకరించిన రూ.25,000ల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీరంతా ఒకప్పుడు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్నారు. స్నేహితులను గ్రామస్తులు అభినందించారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



తక్షణ సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: ఇంటి పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఒక వరమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఇటీవల కొత్తపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు జానకమ్మ మరణించింది. దీంతో ఆమె కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ మండప వేడుకలు



మండప నిర్మాణం పూజలు చేస్తున్న భక్తులు

టెక్కలి: మండలంలోని మేఘవరం గ్రామంలో మరిడమ్మ తల్లి మండప నిర్మాణ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గంగాధరపేట గ్రామానికి చెందిన బమ్మిడి కృష్ణారావు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో మండప నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా అమ్మవారికి గ్రామం లో ఊరేగింపు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసమారాధన చేపట్టారు.

మున్సిపల్ కమిషనర్‌గా నాగేంద్రకుమార్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా టిబిరిశెట్టి నాగేంద్రకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జరుగుతున్నటువంటి బదిలీల్లో భాగంగా జీవీఎంసీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన కమిషనర్‌గా ఇక్కడికి రానున్నారు. ఈయన ఇదివరకు 2013, 2014, 2019 సంవత్సరాల్లో ఇక్కడ పనిచేశారు.

ప్రశాంతంగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 16 సహాయకులు, 6 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం 63 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల్లో ఐసీడీఎస్ పీడీ జయదేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీతులసీ, సీడీపీవోలు శోభారాణి, హైమావతి, విమలకుమారి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పాదయాత్ర చేస్తున్న అశుతోష్

ఇచ్ఛాపురం రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన అశుతోష్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి సంరక్షించాలని కోరుతూ జనవరి 2వ తేదీ నుంచి అయోధ్య నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టాడు. దీనిలో భాగంగా స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి వద్దకు చేరుకున్న ఆయన, ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. దేశంలో 10 వేల కిలోమీటర్లు, 21 రాష్ట్రాలను అనుసంధానం చేసుకుంటూ కన్యాకుమారి చేరుకుంటానని తెలియజేశారు.

ఆదుకోవమ్మా.. అన్నపూర్ణమ్మ



అన్నపూర్ణమ్మ తల్లిని ఊరేగిస్తున్న దృశ్యం

- వైభవంగా మందస గ్రామ దేవత ఉత్సవాలు

మందస గ్రామ దేవత అన్నపూర్ణమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అలనాటి జమీందారుల సంస్కృతి, సాంప్రదాయాలతో ప్రతిరోజూ వీధుల్లో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తున్నారు. విద్యుత్ దీపాలంకరణతో మందస సుందరంగా వెలిగిపోతోంది. పట్టణమంతా ప్రజలతో కళకళలాడుతోంది. సాయంత్రం నుంచి జరుగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు పగటి వేషధారణలతో అలరిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, ఉత్సవ నిర్వహణ కమిటీ నాయకులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. - మందస



విద్యుద్దీపాలంకరణలో సెట్



ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శిస్తున్న దృశ్యం



దేవరవీధిలో ఆకట్టుకుంటున్న పగటి వేషధారణలు



ఆకట్టుకుంటున్న కాళికా నృత్యం

దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



దివ్యాంగులకు త్రీవీలర్ స్కూటీలను అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలి నియోజకవర్గంలో పది మంది దివ్యాంగులకు మంజూరైన త్రీవీలర్ స్కూటీలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలాకి మోహన్, సూరాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించాలి'

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 1, 8, 10, 11 వార్డుల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి పట్టాలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు ఇంటి పట్టాల విషయమై లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను గురించి తహసీల్దార్ గురుప్రసాద్‌కు గురువారం వివరించారు. వీటితో పాటు రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రచార విభాగం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, మధుమూర్తి, తేజేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు సాలిన ఢిల్లీ, ప్రకాష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ గురుప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి తదితరులు

'సైనికుల సహకారం మరువలేనిది'

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురం గ్రామాభివృద్ధిలో త్రివిధ దళాల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల భాగస్వామ్యం మరువలేనిదని సర్పంచ్ గొరకల వసంతరావు అన్నారు. స్థానిక సైనిక సేవా సమితి వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ముందుగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అనంతరం దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సైనిక సేవా సమితి అధ్యక్షుడు కళిశెట్టి దేవదాసు, కోశాధికారి ఎ.రామారావు, ఎంపీటీసీ సభ్యుడు జి.వసంతరావు, గ్రామ పెద్దలు కె.గోపాల్, జి.రామారావు, పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో నినాదాలు చేస్తున్న ఆర్మీ సైనికులు

వలంటీర్ల సేవలు అభినందనీయం



ఇచ్ఛాపురం: వలంటీర్లను సత్కరిస్తున్న వైస్ చైర్‌పర్సన్ భారతిదివ్య తదితరులు

మందస: గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని నారాయణపురం సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, ఎంపీటీసీ గొరకల పార్వతి అన్నారు. మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురంలో గ్రామ వలంటీర్లను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొరకల కేశవరావు, సచివాలయం కన్వీనర్ గొరకల పోలయ్య, సచివాలయ సిబ్బంది మోహనరావు, ఎరమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య అన్నారు. మున్సిపాలిటీలోని 16, 17 వార్డు సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు టింక లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మందస: నారాయణపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

వ్యాన్ బోల్తా.. కళాసీకి గాయాలు

ఇచ్ఛాపురం రూరల్: వ్యాన్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కళాసీ తీవ్రగాయాల పాలైన ఘటన లొద్దపుట్టి జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోంపేటకు చెందిన సానా మోహనరావు పప్పు దినుసులు తీసుకొని, కళాసీ తెలుకల లక్ష్మీనారాయణతో కలసి గురువారం తన వ్యాన్‌లో బరంపురం వెళ్లి సరుకును దించాడు. అనంతరం అక్కడి నుంచి సోంపేటకు తిరిగి వస్తుండగా లొద్దపుట్టి జాతీయ రహదారి పక్కన ఉన్న డివైడర్‌ను అదుపుతప్పి ఢీకొనడంతో వ్యాన్ బోల్తా పడింది. దీంతో కళాసీ లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వైద్యం నిమిత్తం ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాలు

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4.00 గంటలకు దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ రోణంకి ఉమ, జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు హాజరవ్వాలని కోరారు.

ఆణిముత్యాలు పురస్కారాలకు ఎంపిక

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బైపీసీ విద్యార్థిని వజ్జ వెన్నెల 945 మార్కులు, హెచ్ఈసీ విద్యార్థిని ఇప్పిలి చామంతి 925 మార్కులు, సీఈసీ విద్యార్థిని సవర గీత 887 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో పురస్కారాలకు ఎంపికయ్యారని వెల్లడించారు.

4న కాశీవిశ్వేశ్వర కల్యాణోత్సవం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు పరిధి పెంటవీధిలో వెలసివున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణాన్ని ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వార్డు కౌన్సిలర్ శర్వాణ గీత, రవి దంపతులు ఆధ్వర్యంలో రాత్రి 8 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు.

ఘనంగా గారమ్మ తల్లి సంబరాలు

నందిగాం: మండలంలోని లఖిదాసుపురంలో గారమ్మ తల్లి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గారమ్మ తల్లిని గ్రామమంతా మేళతాళాలతో ఊరేగించి, అనంతరం ముర్రాటలు సమర్పించారు. అమ్మవారి ఆలయం వద్ద అరటి గెలలు కట్టి కుంకుమ పూజలు, విశేషాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'బకాయి వేతనాలు అందజేయాలి'

టెక్కలి: రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమను తెరిపించి, బకాయి వేతనాలు అందజేయాలని కార్మికులు కోరారు. స్థానిక లేబర్ కార్యాలయంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఇల్లయ్య, సీఐటీయూ నాయకులు, పరిశ్రమ యాజమాన్యంతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. దీంతో తక్షణమే పరిశ్రమ తెరిచి కార్మికులకు వేతనాలు ఇచ్చేవిధంగా పరిశ్రమ యాజమాన్యం చర్యలు చేపట్టాలని కార్మిక శాఖా సహాయ కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో పి.గంగయ్య, ఎస్.షణ్ముఖరావు, యాజమాన్యం తరపున శంకరయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి తదితరులు

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- బన్నువాడలో గడప గడపకూ మన ప్రభుత్వం

టెక్కలి: వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని బన్నువాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న మేలును తెలియజేశారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. నిష్పక్షపాతంగా పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ పి.మోహన్, నాయకులు పి.సోమేశ్వరరావు, పి.శివ, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, బి.రాకేష్, ఎంపీటీసీలు ఎస్.అప్పలరెడ్డి, డి.కూర్మారావు, నాయకులు ఎస్.మోహన్, టి.లోకేశ్వరరావు, డి.శ్రీను, ఆర్.మరళీరెడ్డి, ఎ.రవి, ఎ.రాహుల్, జి.తేజా, డి.కామన్న, ఎస్.ఆనంద్, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం

వజ్రపుకొత్తూరు: మలేరియా వ్యాపించకుండా దోమల నివారణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మలేరియా నివారణ అధికారి నల్లాన లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వెంకటాపురం, గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా నివారణ మాసోత్సవాల అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యులు దేవి, అంజలి, సుధీర్, ప్రత్యూష, సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, పీహెచ్ఎం అనురాధ, ఫార్మసిస్ట్ బి.గోపాల్, స్టాఫ్ నర్సు కుమారి, భవానీ, అనుష తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్తంగా..

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి చల్లదనం

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానం వాసుల ఇలవేల్పుగా మండలంలోని నీలాపుట్టుగలో పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లికి భక్తులు గురువారం చల్లదనం చేశారు. ఈ సందర్భంగా పాయసాన్ని నైవేద్యంగా తయారీ చేసి, మేళతాళాలు మధ్య అమ్మవారిని ఊరేగించారు.

ఉపాధి పనులతో ఆర్థిక భరోసా



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

కవిటి: ఉపాధి హామీ పథకంతో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటి తంపరలో ఉపాధి పనులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పూడి నీలాచలంతో కలిసి గురువారం ప్రారంభించారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో పనుల సమయంలో వేతనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పినింటి జయరావు, సంతోష్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా అరికట్టండి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ మోహనరావు

కాశీబుగ్గ: రైళ్లలో అక్రమ రవాణాను అరికట్టాలని విశాఖపట్నం జీఆర్‌పీ సబ్ డివిజనల్ అధికారి బి.మోహనరావు సిబ్బందిని ఆదేశించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా పలాస జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో గంజాయి, నల్లమందు వంటి మత్తు పదార్థాల రవాణాను అడ్డుకోవాలన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలాస జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94918 38002 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధి స్థానిక ఆదిఆంధ్రవీధి సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ వీపీ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అంజనేయపురం, మేఘవరం గ్రామాల్లో ఉన్న గ్రానైట్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

టెక్కలి రూరల్: తన భర్త గత నెల 27 నుంచి కనిపించడం లేదంటూ భార్య కల్లేపల్లి రోజా గురువారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. బొప్పాయిపురం గ్రామానికి చెందిన కల్లేపల్లి వీరాస్వామి గత నెల 27న ఉదయం 11గంటలకు పోలాకి మండలం పాలవలస వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సముద్రంలోకి తాబేలు పిల్లలు

సోంపేట: మండలంలోని బారువ సముద్ర తీరంలోకి ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 500 తాబేళ్ల పిల్లలను గురువారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మెరైన్ సీఐ డీవీజే రమేష్‌కుమార్ మట్లాడుతూ ఆలివ్ రిడ్లే పిల్లలను రక్షించడానికి మత్స్యకారులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మెరైన్ పోలీసు సిబ్బంది క్రాంతికుమార్, శేషయ్య, మత్స్యకారులు చంద్రయ్య, కాంతారావు, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ తదితరులు

సోంపేట: రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద అన్నారు. పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నిధి కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని టీవీల్లో గురువారం వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్రి కామేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేతో మేలు

ఇచ్ఛాపురం: సమగ్ర భూసర్వేతో యజమానులకు మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని ఏఎస్‌పేటలో డ్రోన్‌తో సర్వేను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు సాలిన ఢిల్లీ, ప్రకాశరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.